


# నాలుగు రకాల ధన్యులు

**మూలవాక్యము:- కీర్త 32:1,2**
తన అతిక్రమములకు పరిహారము నొందినవాడు తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు. యెహోవా చేత నిర్దోషి అని యెంచబడినవాడు ఆత్మలో కపటములేనివాడు ధన్యుడు.

**1. తన అతిక్రమమునకు పరిహారము నొందిన వాడు. (బరబ్బ)**

**మత్త 27:15-17** జనులు కోరుకొనిన యొక ఖయిదీని పండుగలో విడుదల చేయుట అధిపతికి వాడుక. ఆ కాలమందు బరబ్బ అను ప్రసిద్ధుడైన యొక ఖయిదీ చెరసాలలో ఉండెను. కాబట్టి జనులు కూడి వచ్చినప్పుడు పిలాతు నేనెవనిని విడుదల చేయవలెనని మీరు కోరుచున్నారు? బరబ్బనా? లేక యేసునా? అని వారిని అడిగెను. ఏలయనగా వారు అసూయ చేత ఆయనను అప్పగించిరని అతడు ఎరిగి యుండెను.

**మత్త 27:20:26** ప్రధానయాజకులును పెద్దలును, బరబ్బను విడిపించుమని అడుగుటకును, యేసును సంహరించుటకు జనసమూహములను ప్రేరేపించిరి. అధిపతి ఈ యిద్దరిలో నేనెవనిని విడుదల చేయవలెనని మీరు కోరుచున్నారని వారనడుగగా వారు బరబ్బనే అనిరి.

**మార్కు 15:6-15** అధికారుల నెదిరించి, కలహములో నరహత్య చేసిన వారితో కూడ బంధించబడియుండిన బరబ్బ అను ఒకడుండెను.

**లూకా 23:18-25** వీడు పట్టణములో జరిగించిన యొక అల్లరి నిమిత్తమును నరహత్య నిమిత్తమును చెరసాలలో వేయబడిన వాడు.

**బరబ్బ:-** ఈ మాటకు తండ్రి యొక్క కుమారుడు అని అర్థం. హెబ్రీ భాషలో **BAR / BEN** అనే పదానికి కుమారుడు అని, **ABBA** అనే పదానికి తండ్రి అని అర్థం. ఈ బరబ్బ ఒక బందిపోటు దొంగ.

**మత్త 27:16** ఆ కాలమందు బరబ్బ అను ప్రసిద్ధుడైన యొక ఖయిదీ చెరసాలలో ఉండెను.

**లూకా 23:19** వీడు పట్టణములో జరిగించిన యొక అల్లరి నిమిత్తమును నరహత్య నిమిత్తమును చెరసాలలో వేయబడిన వాడు.

పస్కా పండుగలో ఖైదీని విడిపించే ఆచారం ఉంది. కాబట్టి పిలాతు యేసు క్రీస్తును విడిచి పెట్టుటకై యూదులను అడిగాడు.ప్రధానయాజకులైతే యేసుకు బదులుగా బరబ్బను విడిచి పెట్టవలసినదిగా జనులను ప్రేరేపించి కేకలు వేయించారు. **(మార్కు 15:14)** మరి క్రీస్తును ఏమి చేయాలని పిలాతు అడిగినప్పుడు సిలువ వేయుమని కేకలు వేసారు. వారి కేకలే గెలిచెను అని సువార్తికుడు వ్రాసాడు. **(లూకా 23:23)** పిలాతు కూడ జన సమూహమును సంతోషపెట్టుటకు మనస్సు గలవాడైనందున బరబ్బను విడిచిపెట్టి ప్రభువైన యేసు క్రీస్తును సిలువ వేయ నప్పగించెను.

బరబ్బా విడిపించబడడం యేసు క్రీస్తు మరణానికి అప్పగించబడడం పాత నిబంధన క్రమము, ప్రవచనానుసారం. దీనిని అజాజేలు అనే మెసేజ్‌లో సవివరంగా తెలుసుకోవలసినదిగా మనవి.

**2. తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందిన వాడు ధన్యుడు. (పేతురు)**

ప్రథమ శిష్యుడై కేఫా అని పిలవబడి తన పైన సంఘాన్ని కడతానని క్రీస్తు చెబితే ఆ క్రీస్తుని ఎరుగనని ముమ్మారు అనడం ఎంత ఘోర పాపం. ఈ తప్పు చాలా భయంకరమైనది. ఎందుకంటే ఎవరైతే యేసు క్రీస్తును ఈ లోకంలో ఎరుగనని చెబుతారో పరలోకంలో తండ్రియెదుట దూతలయెదుట వారిని ఎరుగనని క్రీస్తు చెబుతానన్నాడు.

**మత్త 10:32-33** మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడు ఎవడో పరలోక మందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును. మరి ముమ్మారు క్రీస్తుని ఎరుగనని చెప్పిన పేతురుకు పరలోకములో స్థానము ఎక్కడ ఉంది?

అయితే ఇలాంటి పరిస్థితి వస్తుందని తన కోసం ప్రార్థిస్తున్నానని క్రీస్తు ముందే చెప్పారు.

**లూకా 22:31,32** సీమోనూ, సీమోనూ ఇదిగో సాతాను మిమ్మును పట్టి గోధుమల వలె జల్లించుటకు మిమ్మును కోరుకొనెను గాని నీనమ్మిక తప్పిపోకుండునట్లు నేను నీకొరకు వేడుకొంటిని. నీ మనస్సు తిరిగిన తరువాత నీ సహోదరులను స్థిరపరచుమని చెప్పెను.

ఈ పాపాన్ని ప్రాయశ్చిత్తము చేశారు కనుకనే పేతురు ధన్యుడు. ఎలా? ప్రాయశ్చిత్తం చేశారనేది **యోహాను సువార్త 21:15-18** లో చూడవచ్చు. ముమ్మారు ఎరుగననిన పేతురు చేత ముమ్మారు ప్రేమిస్తున్నాని చెప్పించి బాధ్యతలు ఒప్పించి పేతురుకు ప్రాయశ్చిత్తం చేశారు.

దేవుని పని త్రికరణ శుద్ధితో చేయటం కూడా ప్రాయశ్చిత్తంలో భాగమే. తండ్రి పని చేయటానికి వచ్చానని పన్నెండ్రు యేండ్ల ప్రాయములో చెప్పి ముప్పది మూడన్నర సంవత్సరాల వయస్సులో దాని ముగించినానని చెప్పిన క్రీస్తు తన పని ద్వారా మనకు ప్రాయశ్చిత్తం దయ చేశారు. దేవుని ప్రేమించేవాడు దేవుని పని చేస్తాడు.

జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును. జీవగ్రంథంలో నుండి అతని పేరెంత మాత్రమును తుడుపు పెట్టక నా తండ్రి యెదుటను ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పుకొందును. **(ప్రక 3:5-6)** సంఘములతో ఆత్మ చెప్పుచున్న మాట చెవి గల వాడు వినును గాక.

పేతురు పేరు జీవ గ్రంధంలో వ్రాయబడింది అనే రుజువు **లూకా 10:20** అయినను దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని వారితో చెప్పెను. ఈ మాట సాక్షాత్తు ప్రభువైన క్రీస్తు చెప్పారు గనుక పేతురు దావీదు ప్రవచించినట్లు తాను చేసిన పాపమునకు ప్రాయశ్చిత్తం పొందాడు.

**3. యెహోవా చేత నిర్దోషి అని ఎంచబడిన వాడు. (రెండవ దొంగ)**

**మత్త 27:38,44** మరియు కుడివైపున ఒకడును ఎడమ వైపున ఒకడును ఇద్దరు బందిపోటు దొంగలు ఆయనతో కూడ సిలువ వేయబడిరి. ఆయనతో కూడ సిలువ వేయబడిన బందిపోటు దొంగలును ఆలాగే ఆయనను నిందించిరి.

**మార్కు 15:27,28,32** మరియు కుడివైపున ఒకనిని ఎడమవైపున ఒకనిని ఇద్దరు బందిపోటు దొంగలను ఆయనతో కూడ సిలువవేసిరి.

ఇశ్రాయేలు రాజగు క్రీస్తు ఇప్పుడు సిలువ మీద నుండి దిగి రావచ్చును. అప్పుడు మనము చూచి నమ్ముదమని యొకరితో ఒకరు చెప్పుకొనిరి. ఆయనతో కూడ సిలువ వేయబడిన వారును ఆయనను నిందించిరి.

**లూకా 23:39-43** వ్రేలాడవేయబడిన ఆ నేరస్థులలో ఒకడు ఆయనను దూషించుచు నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మును కూడ రక్షించుమని చెప్పెను. అయితే రెండవ వాడు వానిని గద్దించి నీవు అదే శిక్షా విధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా? మనకైతే యిది న్యాయమే; మనము చేసిన వాటికి తగిన ఫలము పొందుచున్నాము గాని యీయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి ఆయనను చూచి యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను. అందుకాయన వానితో నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను.

**యోహా 19:18** అక్కడ ఈ వైపున ఒకనిని ఆ వైపున ఒకనిని మధ్యను యేసును ఉంచి ఆయనతో కూడ ఇద్దరిని సిలువ వేసిరి.

యేసు క్రీస్తుతో కూడ ఇద్దరు బందిపోటు దొంగలను కూడ సిలువ వేశారు. వారిద్దరు కూడ క్రీస్తును మొదట నిందించారు.

ఆ తరువాత ఎడమవైపున ఉన్న దొంగ యేసు క్రీస్తును చూచి నిన్ను నీవు రక్షించుకొని మమ్మును కూడ రక్షించమన్నాడు. **లూకా 23:39**

అయితే రెండవ దొంగ కుడివైపున ఉన్నవాడు వానిని గద్దించి ఈలాగున అన్నాడు. **లూకా 23:40,41** అంతమాత్రమే కాదు యేసు క్రీస్తు వైపు తిరిగి అభ్యర్థించాడు. **లూకా 23:42**

వెంటనే యేసు క్రీస్తు ఈ ప్రార్థన నంగీకరించి ఆ బందిపోటు దొంగకు క్షమాపణ దయచేయడమే గాక పరదైసులో తనతో పాటు స్థానాన్ని దయ చేశారు. **లూకా 23:43**

ఈ సత్యాన్ని కొన్ని వందల సంవత్సరాలకు మునుపే దావీదు ప్రవచిస్తున్నాడు. తాను క్రీస్తుతో చేసిన విన్నపాన్ని బట్టి ఒప్పుకోలును బట్టి దోషులను, నిర్దోషులుగా తీర్పుతీర్చే దేవుడు. ఈ దొంగను నిర్దోషిగా తీర్చి తనతో పరదైసుకు తీసుకు వెళ్లారు.

### 4. ఆత్మలో కపటము లేని వాడు ధన్యుడు. (శతాధిపతి)

**మత్త 27:54** శతాధిపతియు అతనితో కూడ యేసునకు కావలి యున్న వారును భూకంపమును, జరిగిన కార్యములన్నిటిని చూచి మిక్కిలి భయపడి నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి.

**మార్కు 15:39** ఆయన కెదురుగా నిలిచియున్న శతాధిపతి ఆయన ఈలాగు ప్రాణము విడుచుట చూచి –నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడే అని చెప్పెను. కొందరు స్త్రీలు దూరము నుండి చూచుచుండిరి.

**లూకా 23:47** శతాధిపతి జరిగినది చూచి ఈ మనుష్యుడు నిజముగా నీతిమంతుడై యుండెనని చెప్పి దేవుని మహిమపరచెను.

**మత్త 28:11-15** వారు వెళ్లుచుండగా కావలి వారిలో కొందరు పట్టణములోనికి వచ్చి జరిగిన సంగతులన్నిటిని ప్రధానయాజకులతో చెప్పిరి. కాబట్టి వారు పెద్దలతో కూడి వచ్చి ఆలోచన చేసి ఆ సైనికులకు చాలద్రవ్యమిచ్చి మేము నిద్రపోవుచుండగా అతని శిష్యులు రాత్రి వేళ వచ్చి అతనిని

ఎత్తికొనిపోయిరని మీరు చెప్పుడి. ఇది అధిపతి చెవినిబడిన యెడల మేమతని సమ్మతిపరచి మీకేమియు తొందర కలుగకుండ చేతుమని చెప్పిరి. అప్పుడు వారు ఈ ద్రవ్యము తీసికొని తమకు బోధింపబడిన ప్రకారము చేసిరి. ఈ మాట యూదులలో వ్యాపించి నేటి వరకు ప్రసిద్ధమైయున్నది.

శతాధిపతి అంటే 100 మంది సైనికులకు అధిపతి యేసు క్రీస్తును సిలువ వేయడము ఈ అధిపతి ఆధ్వర్యంలోనే జరిగింది. ప్రభువైన యేసు క్రీస్తు గెత్సెమనే తోటలో పట్టబడింది. మొదలు సమాధి భద్రము చేయబడే వరకు ఈ శతాధిపతి ప్రతి సంధర్భాన్ని జాగ్రత్తగా గమనిస్తూనే ఉన్నాడు.

రోమా సైనికులు ప్రపంచంలోనే క్రూరులు. వారి అధిపతి ఎలాగుంటాడో చెప్పనక్కర లేదు. అయితే యేసు క్రీస్తును భయంకరమైన శ్రమలకు గురి చేసి ఆయన సిలువలో పలికిన మాటలు విని ఆయన మరణాన్ని కళ్లారా చూసిన శతాధిపతి నోటి వెంట ఒక అద్భుతమైన సాక్ష్యం వెలువడింది.

**"ఈయన నిజముగా దేవుని కుమారుడు"** అని ఈయనతో పాటు సైనికులు కూడ ఆ మాట చెప్పుకున్నట్లు మనం మత్తయి సువార్త **(మత్త 27:54)**లో చూడగలం.

వాస్తవానికి ఒక రోమా శతాధిపతి, పైగా క్రీస్తును సిలువ వేసిన బృంద నాయకుడు అలాంటి సాక్ష్యం చెప్పాలంటే నిజముగా అతడు ఆత్మతో కపటము లేని వాడై ఉండాలి. ఈ సత్యాన్నే దావీదు ముందుగానే ప్రవచించారు.

**ప్రియ సహోదరుడా! సహోదరి! మనము ఈ నాలుగు రకాల ధన్యులలో ఏ ధన్యుని కోవలోకి వస్తాము. ఒకసారి పరీక్షించుకుందాం.**

**ఈ నాలుగు రకాల ధన్యతలు పరిశుద్ధాత్మ దేవుడు మనకు అనుగ్రహించును గాక. ఆమేన్...**